

# అక్కడక్కడా దాడులు



టీడీపీ, వైసీపీ వర్గాలను నిలువరిస్తున్న పోలీసులు

- పాలకొండలో జనసేన వర్గీయులపై వైసీపీ దాడి
- కురుపాంలో ఇరు పార్టీల మధ్య ఘర్షణ
- పోలింగ్ కేంద్రాల వద్ద అధికారపార్టీ ప్రలోభాలు
- కొన్నిచోట్ల విద్యుత్ అంతరాయం.. చీకట్లోనే పోలింగ్
- భాసూరులో ఎమ్మెల్యే కళావతిని అడ్డుకున్న గ్రామస్థులు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా ప్రారంభమైన ఓటింగ్
- పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన ఓటర్లు



పాలకొండలో...

**పార్వతీపురం, మే13 (ఆంధ్రజ్యోతి):** సార్వత్రిక పోరు ముగిసింది. జిల్లాలో కొన్నిచోట్ల చెదురుమదురు ఘటనల మినహా అంతటా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగింది. అయితే ఎన్నడూ లేనివిధంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఎండా, వానను లెక్కచేయలేదు. గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, యువతతో పాటు వలస ఓటర్లు కూడా భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. జిల్లాలో సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ సమయం ముగిసినప్పటికీ అప్పటికే కేంద్రాల వద్ద ఉన్న వారికి అధికారులు ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. పార్వతీపురం నియోజకవర్గంలోనూ సాయంత్రం ఆరు గంటల్లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారందరూ ఓటు వేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో పట్టణంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం రాత్రి 8 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. రాత్రి 11 గంటల తర్వాత అందిన సమాచారం మేరకు పార్వతీపురంలో 76.59 శాతం, పాలకొండలో 74.03 శాతం, కురుపాంలో 74 శాతం, సాలూరులో 76.30 శాతం చొప్పున ఓటింగ్ నమోదైనట్లు తెలిసింది. మొత్తంలో జిల్లాలో 75.24 శాతంగా పోలింగ్ నమోదైంది. అరకు పార్లమెంట్ పరిధిలో 69.26 శాతం పైబడి ఓటింగ్ ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

### ఈవీఎంల మొరాయింపు..

జిల్లాలో మొత్తంగా 7లక్షల పైబడి ఓటర్లు ఉన్నారు. అయితే నాలుగు నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైనా తొలుత నత్తనడకగానే సాగిందని చెప్పొచ్చు. సాలూరు, పార్వతీపురం, కురపాం, పాలకొండ నియోజకవర్గాల్లో ఈవీఎంల మొరాయించాయి. పెద్ద ఎత్తున ఓటర్లు తరలివచ్చినప్పటికీ పోలింగ్ వేగవంతంగా జరగకపోవడంతో అనేకమంది తిరిగి వెళ్లిపోయిన పరిస్థితి కనిపించింది. పార్వతీపురం మండలం జమదాల, కొమరాడ మండలం విక్రంపురం, పార్వతీపురం పట్టణం, సాలూరు ఇలా ఎక్కడపడితే అక్కడ ఈవీఎంలు మొరాయించాయి. ఉదయం ఏడు గంటలకు ఓటు్ల వేసేందుకు వచ్చిన వారు క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దఎత్తున వచ్చిన యువత పోలింగ్ కేంద్రాల వద్ద ఓపిగ్గా ఉండి.. తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలాచోట్ల ఈవీఎంలు మొరాయించగా.. అప్పటి కప్పుడు మరమ్మతులు చేయడానికి వీలు కాని పరిస్థితి. దీంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమాచారం అందించి, ఈవీఎంల మరమ్మ తులకు విస్తృత ప్రయత్నాలు చేపట్టారు. అయితే కొంతసేపు తర్వాత ఈవీఎంలు పనిచేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

### వృద్ధులకు తప్పని ఇబ్బందులు

జిల్లాలో అనేకచోట్ల వృద్ధులతో పాటు దివ్యాంగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. అయితే కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు వృద్ధులకు ఇబ్బందులు తప్పలేదు. ఇక సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో కొండ శిఖర ప్రాంతాల నుంచి భారీగా గిరిజనులు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



రాత్రి ఎనిమిది గంటల వరకు పార్వతీపురంలో ఓటర్లు ఇలా..



సాలూరులో పోలింగ్ కేంద్రం బయట బారులుదీరిన ఓటర్లు

### చెదురుమదురు సంఘటనలు...

పార్వతీపురం మండలం బందలుప్పి, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఆయాచోట్ల టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామంలో జనసేన కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేశారు. కురుపాంలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పార్వతీపురం మండలం బందలుప్పి, పెదమరికిలో మందుబాటులు రెచ్చిపోయారు. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో గ్రామస్థులు కలుగజేసుకుని .. అక్కడి నుంచి వారిన పంపించేశారు.



సీతంపేట: సోమగండిలో..

### ఓటేసిన అభ్యర్థులు..

పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాలూరులో టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, వైసీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొరతో పాటు ఇతర పార్టీల అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్ర, వైసీపీ అభ్యర్థి జోగారావు, పాలకొండలో జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, వైసీపీ అభ్యర్థి కళావతి, కురుపాంలో తోయక జగదీశ్వరి, వైసీపీ అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి, కాంగ్రెస్, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### బందోబస్తు అంతంత మాత్రమే...

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు అంతంత మాత్రంగానే కనిపించింది. రెండు పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతంలో ఇద్దరు కానిస్టేబుళ్లనే ఉంచారు. దీంతో పోలింగ్ కేంద్రం బయట గొడవలు జరిగిన సమయంలో పరిస్థితిని చక్కదిద్దేందుకు పోలీసు సిబ్బంది అవస్థలు పడాల్సి వచ్చింది. ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ సిబ్బంది వాహనాలతో పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవడం కనిపించింది.

## టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ..

**కురుపాం, మే13:** కురుపాంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే సకాలంలో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాంలో ఏడు, శివన్నపేటలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా శివన్నపేట పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకుడు, జిల్లా కో అప్షన్ సభ్యుడు షేక్ నిషారు అక్కడే కూర్చొని వైసీపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. దీనిపై అభ్యంతరం తెలిపిన టీడీపీ వర్గీయులు అక్కడే ఆందోళనకు దిగడంతో ఎస్ఐ షణ్ముఖరావు స్పందించి.. వెంటనే ఇరు వర్గాలను పోలింగ్ కేంద్రం బయటకు పంపించారు. ఇక కురుపాం పోలింగ్ కేంద్రంలో కొంతమంది వైసీపీ వర్గీయులు దొంగ ఓటు వేశారని ఆరోపణలు విని పించాయి. దీంతో టీడీపీ, వైసీపీ నేతలు మళ్లీ వాగ్వాదం జరిగింది. స్వల్ప తోపులాట కూడా చోటు చేసుకుంది. ఇక సాయంత్ర 5 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత టీడీపీ, వైసీపీ వర్గాల వారు ఒకరిపై ఒకరు రెచ్చగొట్టే ధోరణి మాట్లాడుకున్నారు. దీంతో వారు ఘర్షణకు దిగారు. ఎస్ఐ షణ్ముఖరావు, ఆర్‌పీఎఫ్ బలగాలు సర్దిచెప్పినా వినలేకుడా రెండు వర్గాల కొట్టుకునే స్థితికి చేరారు. దీంతో సీఐ సత్యనారాయణ, మరి కొంతమంది పోలీసులు లాఠీలు ఝుళిపించడంతో రెండు వర్గాలు చెదిరిపోయాయి. మళ్లీ ఇరువర్గాల వారు రావడానికి ప్రయత్నించడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. అయితే ఈ ఘటనలో తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టీడీపీ వర్గాలకు గాయాలయ్యాయి. ఒక వర్గానికి సపోర్టుగా పోలీసులు వ్యవహరించడం అన్యాయమన్నారు. తెలుగుయువత అధికార ప్రతినిధి రంజిత్ కుమార్ రోడ్డుపై భైఠాయించారు. వెంటనే సీఐ సత్యనారాయణ అక్కడకు చేరుకుని ఆయనకు సర్దిచెప్పి పంపించేశారు.

## జనసేనవర్గీయులపై వైసీపీ దాడి
- పలువురికి గాయాలు



వైసీపీ వర్గీయులను అరెస్టు చేయాలని నినాదాలు చేస్తున్న రెల్లివీధి వాసులు

**పాలకొండ/వీరఘట్టం:** వీరఘట్టం మండలంలోని తెట్టంగిలో జనసేన వర్గీయులపై సోమవారం వైసీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. గ్రామంలోని ఓ పోలింగ్ కేంద్రంలో జనసేన పార్టీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయనే సమా చారంతో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పోలింగ్‌ను అడ్డుకొనేందుకు యత్నించారు. దీనిలో భాగంగానే సాయంత్రం పోలింగ్ సజావుగా జరిగే సమయంలో వైసీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు ఆధ్వర్యంలోనే దాడులు చేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా పోలింగ్ కేంద్రానికి వెనుకవైపు రెల్లివీధిలో ఉన్న జనసేన వర్గీయులపై వైసీపీ మద్దతుదారులు కర్రలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ ఘటనలో రెల్లికులానికి చెందిన పలువురు గాయపడ్డారు. వీరిలో రాగోలు నరసింహులు, సత్యవతి, రాజేష్‌తో పాటు పి.చంద్రమోహన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. ఈ క్రమంలోనే మంచంపై ఉన్న కేన్సర్ పేషెంట్ లక్ష్మీపైన దాడికి పాల్పడ్డారు. వారిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ఫక్రుద్దీన్‌లు తెట్టంగి గ్రామానికి చేరుకొని అల్లరిమూకలను చెదరగొట్టారు. పోలీసులు రావడంతోనే తమకు ప్రాణహాని తప్పిందని జనసేన వర్గీయులు తెలిపారు. ఇదిలా ఉండగా సాయంత్రం రాత్రి 7.30 గంటల సమయంలో నీలానగరంలో ఓటు హక్కును వినియోగించి తన కారులో తిరిగి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కారును బాధితులు చుట్టుముట్టారు. తమపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని, గాయపడిన వారికి న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు వేడుకున్నాయి. విషయం తెలుసుకున్న జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ పాలకొండ ఏరియా ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. టీడీపీ నాయకులు తేజోవతితో కలిసి గ్రామానికి చేరుకొని బాధితులకు భరోసా ఇచ్చారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## వైసీపీ ప్రలోభాలు



వివేకానంద కాలనీలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం

**పార్వతీపురం టౌన్ మే 13 :** పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు. తమ పార్టీ గుర్తుకే వేయాలని కోరారు. దీనిని టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో వారి మధ్య వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. 3వ వార్డు వివేకానంద కాలనీలో ఓటరు స్లిప్పుల పంపిణీలో జాప్యం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు వారిని అక్కడ నుంచి బయటకు పంపించారు. పలు పోలింగ్ బూత్‌ల వద్ద అధికార పార్టీ శ్రేణుల ఓవర్ యాక్షన్‌ను టీడీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టారు.

## ఎమ్మెల్యే కళావతికి చుక్కెదురు



వైసీపీ అభ్యర్థి కళావతిని అడ్డుకుంటున్న గ్రామస్థులు

**పాలకొండ:** పాలకొండ వైసీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి పలు గ్రామాల్లో చుక్కెదురైంది. పాలకొండ, వీరఘట్టం తదితర పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. కాగా భాసూరు పోలింగ్ కేంద్రం లోపలికి ఆమె వెళ్లేందుకు ప్రయత్నించగా ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్న వేళ ఎమ్మెల్యే అభ్యర్థి పోలింగ్ కేంద్రంలో ఎందుకని వారు ప్రశ్నించారు. ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు. దీంతో ఆమె వెనుదిరిగారు.



జియ్యమ్మవలస: చినమేరంగిలో ..



పార్వతీపురంటౌన్‌లో ఎండలోనే ఉన్న ఓటర్లు



సాలూరులో సొమ్మసిల్లిన మహిళ



భామిని: బొడ్డగూడలో ...



పాంచాలిలో ట్రాక్టర్‌పై ఓటర్లను తీసుకెళ్తున్న దృశ్యం

## ఓటేసి వస్తూ.. వడదెబ్బతో హిజ్రా మృతి



మృతిచెందిన రాజారావు

**గుమ్మ లక్ష్మీపురం:** పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం పెద్దఖర్జ పంచాయతీకి చెందిన ఓ గిరిజన హిజ్రా ఓటేసి వస్తూ.. వడదెబ్బకు గురై మృతి చెందారు. సోమవారం పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్ నెంబర్-83 దగ్గరకు బిడ్డిక రాజారావు(55) అనే హిజ్రా వెళ్లారు. క్యూలైన్‌లో నిరీక్షించిన తర్వాత ఓటు వేసి తిరిగి ఇంటికి పయనమ్యారు. అయితే పోలింగ్ కేంద్రం దాటిన కొద్దిసేపటికే మార్గమధ్యంలో రాజారావు కుప్పకూలిపోయారు. స్థానికులు వచ్చి చూడగా.. అప్పటికే రాజారావు మృతి చెందారు.

## చీకట్లోనే పోలింగ్..

**పాలకొండ:** పాలకొండ, వీరఘట్టం, సీతంపేట మండలాల్లో మధ్యాహ్నం మూడున్నర గంటల తర్వాత ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6.30 గంటల తర్వాత కూడా కరెంట్ రాకపోవడంతో చీకటిలోనే ఆయా చోట్ల పోలింగ్‌ను నిర్వహించారు. పలు పోలింగ్ కేంద్రాల్లో సెల్‌లైట్ల మధ్య ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించారు. ఇదే సమయంలో వృద్ధులు ఓటు వేసేందుకు ఇబ్బందులు పడ్డారు.

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఐజీ..

పాలకొండలో పలు పోలింగ్ కేంద్రాలను విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని, ఎన్నికల అబ్జర్వర్ ప్రమోద్‌కుమార్, ఆర్వో శుభం బన్సల్ తదితరులు సందర్శించారు. పోలింగ్ సరళిపై ఆరా తీశారు.



భద్రతా ఏర్పాట్లపై సిబ్బందితో చర్చిస్తున్న డీఐజీ



పాలకొండ: చీకట్లోనే పనిచేస్తున్న పోలింగ్ సిబ్బంది

## ఓటు వేసేందుకు నదిని దాటి..

**కొమరాడ/కురుపాం రూరల్ :** మండలంలోని చోళ్లపథం పంచాయతీ రెబ్బ, వనధార గ్రామాల గిరిజనులు నాగావళి నదిని దాటి.. కూనేరు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. రోడ్డు మార్గం నుంచి చేరుకోవాలంటే చాలా దూరం కావడంతో ఇలా నదిలో నడుచుకుంటూ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే వర్షాకాలంలో మాత్రం ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

## ఒక్క ఓటు కోసం గంటన్నర ఉత్కంఠ

**పాలకొండ:** స్థానిక పెదకాపువీధిలోని పోలింగ్ కేంద్రంలో ఒక్క ఓటు కోసం గంటన్నరపాటు ఉత్కంఠ నెలకొంది. సాయంత్రం ఐదు గంటల లోపలే పెదకాపువీధికి చెందిన ఉదయాన చంద్రినాయుడు అనే యువకుడు పోలింగ్ కేంద్రానికి చేరుకుని.. అక్కడే వేచి ఉన్నాడు. అయితే అప్పటికి 15 మంది వరకు క్యూలైన్‌లో ఉన్నారు. వారి తర్వాత ఓటు హక్కు వినియోగించుకొనేందుకు చంద్రినాయుడు ప్రయత్నించగా వైసీపీ పోలింగ్ ఏజెంట్లు అడ్డుకున్నారు. దీంతో చంద్రినాయుడు వారితో వాగ్వాదానికి దిగారు. ఇదే సమయంలో టీడీపీ, వైసీపీ ఏజెంట్ల మధ్య మాటామాటా పెరిగింది. పోలింగ్ కేంద్ర ప్రిసైడింగ్ అధికారి సరైన నిర్ణయం తీసుకోలేక తర్జనబర్జన పడ్డారు. సాయంత్రం ఆరున్నర నుంచి రాత్రి 8.15 గంటల వరకు దీనిపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలోనే టీడీపీ, వైసీపీ నాయకులు ఒక్కొక్కరిగా అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ అక్కడకు చేరుకొని పీవోతో చర్చించి ఓటుహక్కును కల్పించారు. దీనితో వివాదం సద్దుమణిగింది.

## స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలు

**గరుగుబిల్లి, మే 13 :** ఉల్లిభద్రలోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు సోమవారం రాత్రి ఈవీఎంలు చేరాయి. ఈ మేరకు నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూముల్లో వాటిని భద్రపర్చారు. సంబంధిత ఎన్నికల సిబ్బంది ఈవీఎం యంత్రాలకు సీళ్లు వేసి తదుపరి ప్రత్యేక భద్రత సిబ్బందికి అప్పగించారు. జూన్ 4న సంబంధిత రాజకీయ పార్టీల ప్రతి నిధుల సమక్షంలో సీళ్లను తొలగించి లెక్కింపు నిర్వహించనున్నారు. స్ట్రాంగ్ రూముల ప్రాంతంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఈవీఎంలతో చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది

# దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



# మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హై సీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారితన 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.( ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

### బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

### బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

### బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ది చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్గ్రహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

# ఐఐఎఫ్‌టీ

## ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

**ప్రోగ్రామ్ వివరాలు:** ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

**అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

# ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజీపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

**విభాగాలు-సీట్లు:** ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.


**అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

**వెబ్‌సైట్:** ihmhajipur.net

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PRJDZZDలో చదవండి.

# నవ్య | చిత్రజ్యోతి





## క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు

సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండ'ంటూ పిలుపునిచ్చారు.











## మాతృభాషలోనూ డబ్బింగ్

దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





## కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

## నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు



జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠి నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠి నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠి చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.


బొబ్బిలి: ఓటేసిన బేబీనాయన సోదరులు


భోగాపురంలో ఓటేసిన నాగమాధవి


రాజాం: ఓటేసిన కోండ్రు


ఎల్‌కోట: ఓటేసిన కోళ్ల లలితకుమారి


చీపురుపల్లి: పోలింగ్ స్టేషన్ల పరిశీలనలో కళా..


ఓటేసిన కే శ్రీనివాస్


ఓటేసిన నాగార్జున


కొత్తవలసలో పోలింగ్ కేంద్రానికి వచ్చిన శ్రీభరత్

# ఓటెత్తారు..

- ప్రశాంతంగా పోలింగ్
- భారీగా తరలివచ్చిన వృద్ధులు, మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అన్ని చోట్ల ఆరుగంటలకే ముగిసిపోగా కొన్ని చోట్ల రాత్రి పదకొండు గంటల దాకా కొనసాగాయి. మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో బారులు తీరగా అధికారులు పక్కా ఏర్పాట్లతో ఎన్నికల ప్రక్రియను కొనసాగించారు. ఉన్నతాధికారులు, ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎక్కడా ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం


గజపతినగరం: పురిటిపెంటలో ఓటేసిన కొత్త ఓటర్లు


భోగాపురం: అప్పన్నపేటలో వేచి చేస్తున్న ఓటర్లు..


డెంకాడ: క్యూలో ఉన్న ఓటర్లు

## వృద్ధులను తీసుకొస్తూ..


నెల్లిమర్లలో..


తెర్లాంలో మంచంపై మోసుకొస్తూ..


వంగరలో..


పూసపాటిరేగ: స్పృహ తప్పిన మహిళకు సపర్యలు


బొండపల్లి: దేవుపల్లి పోలింగ్ బూత్ వద్ద వర్షంలో..


గరివిడిలో ఓటు వేయడానికి క్యూలో..


బొబ్బిలిలో వృద్ధురాలిని మోసుకొస్తున్న పోలీస్


ఎస్.కోట: చింతబడి పోలింగ్ బూత్ వద్ద..


రేగిడి: కొడిశలో క్యూలో ఓటర్లు


తెర్లాం: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పరిశీలకులు


రాజాంలో ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధురాలు


బాడంగి: పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలిశెట్టి

## మహిళల బారులు..


రామభద్రపురంలో..


జామి: జాగరంలో వర్షంలో మహిళలు..

## పార్వతీపురం మన్యం జిల్లాలో..


ఓటేసిన జగదీశ్వరి


ఓటేసిన విజయచంద్ర దంపతులు


ఓటేసిన జయకృష్ణ


ఓటేసిన సంధ్యారాణి


సాలూరు మండలంలో బారులు తీరిన ఓటర్లు


మక్కువలో ఓటర్లు ఇలా..


పార్వతీపురంలో ఓటు వేసిన కలెక్టర్ దంపతులు


బలిజిపేట: పోలింగ్ బూత్ వద్ద నిల్చున్న ఓటర్లు


సీతంపేట: సోమగండి పోలింగ్ కేంద్రం వద్ద..


జియ్యమ్మవలస: పోలింగ్ కేంద్రం వద్ద ఏఎస్పీ దిలీప్‌కిరణ్


పాచిపెంటలో భారీ క్యూ


సాలూరు: ఈవీఎంకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


సీతానగరంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్


పాలకొండ: క్యూ లైన్లలో..

## ఒడిశాలో తొలివిడత ఎన్నికల పోలింగ్



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

**రాయగడ:** ఒడిశాలో తొలిదశ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాయగడ నియోజకవర్గంలో 60 శాతనికి పైగా ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఎన్నికలు తొలుత మందకొడిగా జరిగాయి. అనంతరం ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి అనసూయ మాఝి, అప్పలస్వామి కద్రక, ఎంపీ అభ్యర్థి సప్తగిరిశంకర ఉలకా తదితర ప్రముఖులు ఓటు కుటుం బాలతో వినియోగించుకున్నారు. ఐదుపోలింగ్‌బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందిపడ్డారు. సమాచారం అందే సమయానికి జిల్లాలోని గుణుపురం 57.44 శాతం, బిసంకటక్ 67.99 శాతం, రాయగడ 63.2 శాతం పోలింగ్ నమోదైంది.

## మాతృప్రేమ వెలకట్టలేనిది



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**రాయగడ:** సృష్టిలో వెలకట్టలేని మాతృప్రేమఅని స్పందన అధ్యక్షుడు గుడ్ల గౌరి శంకరప్రసాద్ తెలిపారు. స్థానిక స్పందన కార్యాలయంలో మాతదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు జయంతి పురస్కరించుకుని ఆధ్యాత్మిక ప్రవచనకర్త భళ్లమూడి వెంకటనాగేశ్వరరావు మాట్లాడారు. సంస్థ కార్యదర్శి పతివాడ తులసీదాస్ శంకరాచార్యుల జీవన విధానం, సమాజ సౌభాగ్యం కోసం ఆయన నేర్పిన సిద్ధాంతాలను వివరించారు.

## తాగు నీటికి కటకట

- రెండు రోజులకోసారి రెండు బిందెలు సరఫరా
- సీతంపేట మన్యంలో గిరిజనుల అవస్థలు



మూలకుచేరిన గ్రావిటీ ఫ్లో పథకం

**సీతంపేట:** మన్యంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. అరకొరగా గ్రామీణ నీటిసరఫరా విభాగం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తోంది. రెండు రోజులకోసారి ఇంటికి రెండు బిందెలు సరఫరా చేస్తుండడంతో సరిపోకపోవడంతో గిరిజనులు ఇబ్బందిపడుతున్నారు. మండలంలో 46 గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి ఉన్నట్టు గుర్తించారు. మొదటి విడతగా 17 గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ రెండు రోజులకు ఒకసారి ఒక్కొక్క ఇంటికి రెండు బిందెలు చొప్పున నీరు సరఫరా చేయడం వల్ల తాగునీటి అవసరాలు తీరడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఆ నీళ్లనే భద్రంగా ఉంచుకుని కొద్దికొద్దిగా వాడుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. తాగునీరు సౌకర్యం గతంలో పుష్కలంగా ఉండేదని, వేసవి ఎద్దడికి గ్రావిటేషన్ ఫ్లో ఎండిపోవడం వల్ల తాగునీరు సమస్య అధికంగా ఏర్పడిందని గిరిజనులు చెబుతున్నారు. ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు అధికారులను కోరుతున్నారు. గ్రామాల్లో రోజురోజుకు తాగునీటి సమస్య అధికమవుతోంది. గతంలో పంచాయతీ నిధుల ద్వారా తాగునీటి సమస్య పరిష్కారమయ్యేది. ప్రస్తుతం పంచాయతీలకు నిధుల లేమితో బోర్లు కూడా మరమ్మతు చేయలేని పరిస్థితి ఏర్పడింది. జూన్ నెలలో తాగునీటి ఎద్దడి మరింత పెరిగే అవకాశం ఉండడంతో గిరిజనులు ఏం చేయాలనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన్యంలో తాగునీటి ఎద్దడి విషయమై గ్రామీణ నీటి సరఫరా అధికారులను కోరగా ట్యాంకర్ల ద్వారా ప్రస్తుతం నీటిని సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు.గ్రావిటీ ఫ్లో ఊటబావులు ఎండిపోవడంతో సుదూరు ప్రాంతాలకు వెళ్లి గెడ్డల నుంచి నీటిని తెచ్చుకోవల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

## సువర్ణముఖి చెంతన తాగునీటి కష్టాలు



అడుగంటిన సువర్ణముఖి నది

**మక్కువ:**మక్కువలో సువర్ణముఖినది చెంతన తాగునీటికి గ్రామస్థులు వస్తలకు గురవుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే నదిలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. మక్కువ వద్ద నదిలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. కొన్ని చోట్ల నది ఏడారిని తలపిస్తోంది. కొద్దిపాటి నిల్వఉన్న నీటితోనే మక్కువతోపాటు నది పరిసర గ్రామస్థులు తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా మక్కువ మేజర పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు కొళాయిలు ద్వారా సరఫరా అవుతున్నా, తాగునీరు సరిపోకపో వడంతో ట్యాంకర్లు ద్వారా నీటిని అందిస్తున్నారు. అలాగే వెంగళరాయసాగర్ జలాశయంలో నీటినిల్వ 161 సెంటీమీటర్లగాను ప్రస్తుతం 156.50గా ఉంది. వీఆర్ఎస్ జలాశయం నుంచి ప్రధాన కాలువకు నీరును స్వల్పంగా విడిచి పెట్టడంతో కింది ప్రాంతంలో నీటినిల్వలు తగ్గిపోయాయి. దీంతో తాగునీటికి పలు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



# పోలింగ్ ప్రశాంతం

- తెల్లవారి నుంచే బారులుతీరిన ఓటర్లు
- వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యాలు
- తరలివచ్చిన వలస ఓటర్లు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు

**జిల్లాలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తెల్లవారు నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. గతలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వలస ఓటర్లు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఓటింగ్ శాతం పెరిగింది.**

### కురుపాం నియోజకవర్గంలో 60 శాతం పోలింగ్

**కురుపాం:** కురుపాం నియోజవర్గంలో 60 శాతం పోలింగ్ నమోదయ్యింది. స్వల్ప ఘర్షణలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కురుపాంలోని ట్రైసైకిల్ లేకపోవడంలో రోడ్డు నుంచి పోలింగ్ కేంద్రం వరకు ఓ వృద్ధురాలికు మహిళ మోసుకొని వచ్చి ఓటు వేయించింది. వెంటనే ట్రైసైకిల్‌లు తెప్పిడంతో వృద్ధులు ట్రైసైకిల్‌పై కూర్చొని పోలింగ్ కేంద్రాంలో ఓటు వేశారు. కురుపాంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో 50 మంది వరకు ఓట్లు లేకపోవడంతో వెనుతిరిగారు.మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తికి బీఎల్వోలు స్లిపు ఇవ్వక పోవడంతో పోలింగ్ కేంద్రానికు వచ్చి స్లిపు వెతుకుని ఓటువేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ కురుపాంలోని పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. అలాగే కురుపాంలోని పోలింగ్ కేంద్రాలను తెలుగుదేశం అభ్యర్థి తోయక జగదీశ్వరి, టీడీపీ అధికార ప్రతినిధి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, వైసీపీ అభ్యర్థి,ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి పరిశీలించారు. శివ్వన్నపేట పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంతి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- **కురుపాం రూరల్:** మొండెంఖల్ ఏజెన్సీలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొండెంఖల్, వలస బల్లేరు పోలింగ్ కేంద్రాల్లో కొద్దిసేపు రెండు ఈవీఎంలు మొరాయించగా వాటిని సరిచేశారు. మొండెంఖల్, పరిసర ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లల్లో 78శాతం నమోదయ్యింది.

### మొరాయించిన ఈవీఎంలు

**గరుగుబిల్లి:** మండలంలోని గొట్టివలస, కొత్తూరు, రావివలస తదితర పోలింగ్ కేంద్రాల్లో ఉదయం మాక్ పోలింగ్ అనంతరం ఈవీఎంలు మొరాయించాయి దీంతో కొద్దిసేపుయంత్రాలు ఓటింగ్‌కు అంతరాయం కలిగింది. మండలంలోని 49 పోలింగ్‌కేంద్రాలను ఏడు సెక్టార్లగా విభజించారు. 19,455 మంది పురుషులు, 19,257 మంది స్త్రీలకు గాను సుమారుగా 27,168 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దళాయివలస, రావివలసల్లో సమయం ముగిసినా ఓటర్లు అధిక సంఖ్యలో ఉండడంతో ఓటు వేసేందుకు వారికి అధికారులు స్లిప్పులు అందజేశారు. మొత్తంమీద సుమారు 70 శాతం పోలింగ్ జరిగింది. పలు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇరుకుగదులు కావడం, మరోవైపు చీకటిగా ఉండడంతో ఓటు వేసేందుకు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రావుపల్లి తదితర పోలింగ్ కేం ద్రాల్లో పలువురు వృద్ధులు ఈవీఎంలు సరిగ్గా కనిపించకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పురుషులతో సమా నంగా స్త్రీలు ఓటును వేసేందుకు ముందున్నారు. గిజబకు చెందిన మరడాన రామ్మూర్తి పెరాలసిస్‌తో బాధపడటంతో వీల్ ఛైర్‌పై తీసుకువచ్చి ఓటను వేయించారు.నాగూరుకు చెందిన వృద్ధురాలు టి.సూరమ్మను ఆటోపై తీసుకువచ్చి ఓటు వేయించారు.

### ఓటుకు నోటు తీసుకున్నా..

మండలంలోని 25 పంచాయతీల పరిధిలో ఓటర్లు వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో కూటమికి ఓటేసినట్లు తెలుస్తోంది. వైసీపీ నాయకులు ప్రతి ఇంటికి ఓటు వేసేందుకు రూ. వెయ్యి చొప్పున అంద జేసినా, డబ్బులు తీసుకుని వారికి నచ్చిన వారికి ఓటు వేశారు.

### ఈవీఎంలు భద్రపరిచేందుకు సిద్ధం

ఉల్లిభద్రలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ఆవరణలో ఈవీఎం యంత్రాలను భద్రపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలు దించేందుకు ముందుగా దింపేవారికి పలు సూచనలు చేశారు. ఉద్యాన కళాశాల ప్రాంతంలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజక వర్గాలకు చెందిన ఈవీఎం యంత్రాలు భద్రపర్చనున్నారు. ఇప్పటికే భద్రపర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అయితే నియోజకవర్గాలవారీగా యంత్రాలను దింపేందుకు ప్రత్యేక కోడ్‌ను దింపేవారికి కేటాయించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిబ్బంది సిద్ధమయ్యారు. నాలుగు నియోజక వర్గాలకు చెందిన యంత్రాలు పర్యవేక్షణకు అవసరమైన సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈవీఎంలు దించేందుకు సుమారు 220 మంది సహాయకులను ఏర్పాటు చేశారు.

### తొమ్మిది గంటలకే ఓటర్ల బారులు

**గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఉదయం తొమ్మిది గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరారు. ఓటు హక్కును వినియో గించుకోవడానికి మారుమూల గిరిజన గ్రామాల నుంచి కొండ దిగి పోలింగ్ కేంద్రాలకు తెల్లవారే చేరుకున్నారు. కేదారిపురం, బంగరతాడికొండ, ఇరిడి, కేశపడ, కొత్తగూడ, ఎల్విన్‌పేట, కొండవాడ తదితర పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తొలుత కొన్ని చోట్ల ఈవీఎంలు మొరా యించినా తర్వాత అధికారులు సరిచేశారు.

- గుమ్మలక్ష్మీపురం మండలంలోని చెముడుగూడ పోలింగ్ కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని మండలపరిషత్ అధికారి జి.జగదీష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆర్ఓఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో జయగౌడు, ఎంఎల్‌హెచ్‌పీ వనిత తదితరులు పాల్గొన్నారు.
- గుమ్మలక్ష్మీపురం మండలంలోని తాడికొండ పోలింగ్ కేంద్రంలో టీడీపీ కురుపాం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి తోయక జగదీశ్వరి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### నత్తనడకన పోలింగ్

**జియ్యమ్మవలస:**టీకే జమ్ము, ఆర్‌ఆర్‌బీపురం, జియ్యమ్మవలస, తదితర పోలింగ్ కేంద్రాల్లో ప్రారంభంలో ఓటింగ్ నత్తనడకన సాగింది. తర్వాత క్రమేణా ఊపందుకుంది. 59 పోలింగ్ కేంద్రాల పరిధిలో 44 వేల మంది ఓటర్లు ఓటు వినియోగించేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. కొందరు గిరిజనులకు ఓటు వినియోగానికి అవగాహన లేక తడబడ్డారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజు వనజలో, చినమేరంగి పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వృద్ధులు కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో ఓటువేశారు. కుదమ పోలిం గ్ కేంద్రాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ , చినమేరంగి పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ డాక్టర్ ఓ.దిలీప్‌కిరణ్, డీఎస్పీ కృష్ణారావు పరిశీలించారు.

### టెంట్లు లేవు..తాగునీరు లేదు



సాలూరు: మోనంగిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద గొడుగు పట్టుకొని ఎండలో ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో నిలబడిన గిరిజనులు

**సాలూరు:** సాలూరు నియోజకవర్గంలో ఉన్న 243 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు పోలింగ్ నిర్వహించారు. పట్టణంలో 21వ వార్డుకు సంబంధించి 53వ పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించిన కొద్ది సేపటికే ఈవీఎం మొరాయించింది. గొర్లెవీధిలో ఉన్న 65వ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఈవీఎం మిషన్‌తో పాటు,బంగారమ్మకాలనీలో ఏర్పాటు చేసిన 72వ పోలింగ్ కేంద్రంలో కూడా ఈవీఎం మొరాయించింది. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎం మోరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రాలకు భారీ సంఖ్యలో ఓటు వేసేందుకు ఓటర్లు వచ్చి క్యూ కట్టారు. టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఎండతీవ్రతకు అవస్థలకు గురయ్యారు. తాగునీటి సౌకర్యం కల్పించపోవడంతో క్యూలైన్లో ఉన్న ఓటర్లు ఇబ్బందిపడ్డారు. పట్టణంలో చిన్నవీధిలో పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించలేదని ఓటర్లు ఆరోపించారు.బంగారమ్మపేటలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద తోపులాట జరగడంతో ఓ మహిళ స్పృహ కోల్పోయి పడిపోగా వైద్య సిబ్బంది ఆమెకు సపర్యలు చేశారు. పట్టణంలో తొలుత ఉదయం ఏడు గంటలకు ప్రారంభించిన ఓటింగ్ ప్రక్రియ మందకొడిగానే సాగింది. చాలా పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం ఐదు గంటల దాటిన తర్వత కూడా పెద్ద సంఖ్యలో క్యూ లైన్లు ఓటర్లు ఉన్నాయి. వివాదాస్పద 21 కొఠియా గ్రామాల్లో సైతం గిరిజనులు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి పట్టణంలో 21వ వార్డులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద తన ఓటుహక్కును కుటుంబ సభ్యులతో కలిసి వేశారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ తన ఓటును ఒరియా పాఠశాలలో, జీసీసీ ఛైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి చింతలవీధిలో ఉన్న 57వ పోలింగ్ కేంద్రంలో, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పట్టణంలో ప్రభుత్వ బాలికొన్నత పాఠశాలలో ఓటు వేశారు.

### ఉదయం 6.30 గంటల నుంచే బారులు

**పాచిపెంట:** మండలంలోని పాంచాళిలో గల రెండు పోలింగ్ కేంద్రాల్లో ప్రారంభంలోనే ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు క్యూలో నిలబడి ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడు నుంచి 8.30 గంటల వరకు ఈవీఎంలు మొరాయించాయి. సాంకేతిక నిపుణులతో మరమ్మతులు చేపట్టి ఓటింగ్ ప్రారంభించారు. ఉదయం 10 గంటల వరకు మందకొడిగా ఓటింగ్ సాగింది. పాచిపెంటలో 111, 112 పోలింగ్ బూత్‌ల వద్ద సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత కూడా సుమారు 250 మంది బారులుదీరి ఉన్నారు. వృద్ధులను మోసుకొచ్చి ఓటింగ్ చేయించారు. పలు కేం ద్రాల్లో ఉదయం 6.30 గంటల నుంచే ఓటర్లు బారులుదీరారు.హైకోర్టులో స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న మాతుమూరు గ్రామానికి చెందిన ఎస్.శ్రావణ్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- **మక్కువ:** మండలంలో ఎన్నికలు చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ఓటింగ్ జరిగింది. 53 పోలింగ్‌బూత్‌లు ఉండగా 42 వేల 257 మంది ఓటు హక్కును వినియోగించాల్సి ఉండగా సుమారు 65 శాతం పోలింగ్ నమోదైంది. శంబర, మక్కువ, కవిరిపల్లి గ్రామాల్లో ఓటింగ్ సరళిని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి పరిశీలించారు. మక్కువ 206, 211 పోలింగ్ కేం ద్రాల్లో సాయంత్రం ఐదు గంటల దాటి ఓటు వేసేందుకు ఓటర్లు వేచి ఉన్నారు. సాయంత్రం వర్షం కురవడంతో ఓటర్లు అవస్థలకు గురయ్యారు. పోలింగ్ కేం ద్రాల్లో ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### గంటలకొద్దీ క్యూలైన్‌లో నిరీక్షణ

**పాలకొండ:** మండలంలో ఓటింగ్ కోసం ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం ఆరు గంటల నుంచి క్యూ లైన్లలో గంటల కొద్ది నిరీక్షించారు.ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్ర క్రియ ప్రారంభమైంది. రాత్రి ఏడు గంటలు దాటినా పోలింగ్ కేం ద్రాల్లో ఓటర్లు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగిం చుకొన్నారు. పలు పోలింగ్ కేంద్రాల ద్ద టెంట్‌లను ఏర్పాటు చేయకపో వడంతో ఓటర్లు ఎండలోనే ఓటు హక్కు కోసం నిరీక్షించారు. వృద్ధులు, దివ్యాంగులు వీల్‌చైర్ల సాయంతో కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాలకొండలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 184 పోలింగ్ బూత్‌లో ఉదయం ఏడు గంటల నుంచి 8.15 గంటలకు ఈవీఎం మొరాయించడంతో ఓటింగ ప్ర క్రియ ఆలస్యంగా మొదలైంది. అదే పోలింగ్ కేం ద్రంలో 178 పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించింది. పెదకాపు వీధిలో 177 పోలింగ్ కేం ద్రంలో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ సిబ్బందిని సరిచేశారు. పెదకాపువీధిలోని వృద్ధురాలు సత్తెమ్మ ఎంపీ ఓటు వేసి ఎమ్మెల్యే ఓటు వేయకుండా గేటు దాటివెళ్లిపోయంది. అప్పుడు తేరుకున్న సిబ్బంది ఎమ్మెల్యే ఓటు వేయించారు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉండడంతో సాయం త్రం నాలుగు గంటలకు పోలింగ్ కేం ద్రాలకు తరలివచ్చారు. అప్పటికే ఈదురుగాలుతో విద్యుత్‌కు అంతరాయం కలగడంతో పోలింగ్ కేంద్రాల్లో సరైన వెలుతురు లేక పోలింగ్ ప్ర క్రియ ఆలస్యమైంది. పుదకాపువీధి, ఆర్‌సీఎం స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేం ద్రాలకు ఐదు గంటల తర్వాత వచ్చిన వారికి అనుమతించమని సిబ్బంది గేట్లు మూసివేయడంతో వద్ద కొంతమేర హడావుడి నెలకొంది. ఒక్కసారిగా పోలింగ్ కేంద్రం ఆవరణలోకి ఓటర్లు చొచ్చుకొని రావడంతో వారిని సముదాయించడం పోలీస్ సిబ్బందికి కొంతమేర ఇబ్బంది కలిగించింది. అయితే రాత్రి ఎనిమిది గంటలకూ కూడా చీకటిలో సెల్‌ఫోన్ల వెలుతురులో ఓటింగ్ కొనసాగింది.

### మందకొడిగా ఓటింగ్

**భామిని:** మండలంలో 44 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉదయం ఎనిమిది గంటలకే బారులుతీరారు. పలుచోట్ల ఈవీఎంలు ఓటింగ్ నమోదులో ఆలస్యం కావడంతో పలు వురు ఓటర్లు విసిగిపోయారు. దూరప్రాంతాల నుంచి పార్టీ తరపున వాహనాలు ఏర్పా టుచేసి ఓటర్లకు పోలింగ్ కేంద్రాలకు తరలించారు. మధ్యాహ్నం మూడున్నరకు భామిని తదితర కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకటిలో గుర్తులు కనిపించకపోవడంతో పలు కేంద్రాల్లో ఓటర్ల క్యూ ఫిర్యాదుచేశారు. ఐదుగంటలు దాటిన ఓటర్లకు టోకెన్లు అందజేశారు. భామిని, బాలేరు నాలుగు కేంద్రాల్లో టోకెన్లు అందజేసి హాజరైన వారందరికీ ఓట్లు వేయించారు. కొత్తగ చేరిన ఓటర్లలో నూతన ఉత్సాహం కనిపించింది. వారు భారీ సంఖ్యలో వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు.

### తరచూ విద్యుత్ అంతరాయం

**సీతంపేట:** మండలంలో 105 పోలింగ్ కేంద్రాలు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం ఏడు గంటలకే పోలింగ్ కేం ద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల్లో సరైన విద్యుత్ సదుపాయం లేకపోవడం, తరచూ విద్యుత్ అంతరాయం కలగడంతో వృద్ధులు ఓటు వేయడానికి ఇబ్బందికి గురయ్యారు. సాయంత్రం ఐదు గంటలు కొన్ని పోలింగ్ కేం ద్రాల్లో ఓటర్లు క్యూలైన్‌లో నిల్చొని ఉండగా, పోలింగ్ సమయం ముగిసినా ఓటు హక్కు వినియోగించుకున్న వరకు సమయాన్ని కేటాయించారు. చాలామందికి ఓటర్లు జాబితాలో ఓటు హక్కు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. హడ్డుబంగి పోలింగ్ కేంద్రంలో కూటమి నాయకురాలు పడాల భూదేవి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- **వీరఘట్టం:** వీరఘట్టం జేజే కాలేజ్ పోలింగ్ కేంద్రంలో ఉదయంఏడు గంటలకే ఓటర్లు బారులు తీరారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చిన పలువురు యువకులు ఎలు పోలింగ్ కేం ద్రాల్లో ఓటు వేశారు. హుస్సేన్‌పురంలో ఎండలోనే ఓటర్లు వేచి ఉండి ఓటు వేశారు. వీరఘట్టంలోని ఆర్‌సీఎం స్కూల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల ఐదు గంటల తర్వాత కూడా తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు అందుకు లైన్‌లో నిల్చోన్నారు. ఎం.రాజపురం పోలింగ్ కేం ద్రంలో పాలకొండ నియోజకవర్గ జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వండువలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి ఓటు వేశారు.

### రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

**పార్వతీపురంటౌన్:** పార్వతీపురంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమయం సాయంత్రం ఆరు గంటలకు ముగిసినా, ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరడంతో రాత్రి బాగా చీకటి పడే వరకు కొనసాగింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల కమిషన్ పోలింగ్ నిర్వహణకు అనుమతిచ్చింది. అయితే బాలుర ఆర్‌సీఎంలోని 11వ పోలింగ్ కేంద్రంలో రాత్రి ఏడు గంటల తరువాత కూడా పోఇంగ్ కొనసాగింది. జగన్నాథపురం 10వ పోలింగ్ కేంద్రంలో రాత్రి 7.30 గంటలకు పోలింగ్ ముగిసింది. మూడో వార్డు వివేకానంద కాలనీలోని 36వ పోలింగ్ కేంద్రంలో రాత్రి ఎనిమిది గంటల తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాలలోని 40వ, 41వ పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7.40 గంటలకు ముగియగా,శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 42వ, 43వ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ 7.30 గంటల తరువాత కూడా సాగింది. అలాగే ఆరో వార్డు 44వ పోలింగ్ కేంద్రం నవిరి కాలనీలో రాత్రి 8 గంటల తరువాత కూడా పోలింగ్ నిర్వహించారు.



పార్వతీపురంలోని వివేకానంద కాలనీ 36వ పోలింగ్ కేంద్రంలో రాత్రి ఎనిమిది గంటల తర్వాత ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

### ఎండలో నిల్చొని ..

పట్టణంలోని 32వ పోలింగ్ బూత్‌లో ఉదయం 7.20 గంటల వరకు ఈవీఎం మొరాయించింది. దీంతోఓటు వేసేందుకు వచ్చిన 14వ, 15వ వార్డుల ఓటర్లకు ఇబ్బందులు తప్పలేదు. ఎన్నికల అధికారులు, సాంకేతిక నిపుణులు యంత్రానికి మరమ్మతులుచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు ఏర్పాటుచేయకపోవడంతో ఎండలోనే ఉండాల్సివచ్చింది. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ తీ వ్రతకు ఓటర్లు అవస్థలకు గురయ్యారు. కొత్తబెలగాం దత్తుపేట మునిసిపల్ పాఠశాల, కొత్తవలస కేపీఎం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మండుటెండలో నిలబడి ఓటు వేశారు. కొత్తవలస నవిరి కాలనీలో నత్తనడకన పోలింగ్ జరగడంతో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### పోలింగ్ కేంద్రంలోనే ఓటేసిన వృద్ధులు

ఎన్నికల కమిషన్ 80 ఏళ్ల దాటిన వారికి ఇంటి వద్దకే ఓటు వేసే అవకాశం కల్పించింది. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్ల నుంచి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే సంప్రదాయాన్ని పాటిస్తున్న పట్టణానికి చెందిన అల్లూరి రాజులమ్మ(90) మూడో వార్డు వివేకానంద కాలనీలో గల ఠాగూర్ ప్రాథమిక పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకుంది. బోటు రాజు (85) 4వ, 5వ, 9వ వార్డుల పరిధిలో గల సెంట్ పీటర్ ఉన్నత పాఠశాలలో ఓటువేశారు.

### మళ్లీ ఎప్పుడు కలుస్తామో...

ఐదేళ్ల తర్వాత ఎన్నికలు రావడంతో వలస ఓటర్లు తరలివచ్చి ఓటర్లు వేశారు.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల పోలింగ్ కేంద్రంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన స్నేహితులు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మళ్లీ ఎప్పుడు కలుస్తామోనని ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సెల్ఫీలు దిగారు.

- **పార్వతీపురం ఆంధ్రజ్యోతి/రూరల్:** పార్వతీపురంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఉదయం ఏడుగంటల నుంచి ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పెద్ద ఎత్తున ఓటర్లు బారులుతీరారు.గిరిజనులు, కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత, వృద్ధులు, దివ్యాంగులు పెద్ద ఎత్తున పోలింగ్ కేం ద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, పార్వతీపురం, లక్ష్మీనారాయణపురం తదితర కేంద్రాలను పరిశీలించారు. వెంకమ్మపేట పంచాయతీలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచం ద్ర తన సతీమణి అనూషతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- **బలిజిపేట:**మండలంలోని67 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండతీవ్రత వల్ల మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం మూడున్నర గంటల వరకు పోలింగ్ మందకొడిగా జరిగింది.

### వైద్యశిబిరాల పరిశీలన

**సీతానగరం:**బూర్జ,కేఆర్‌పురం, పెదంకలాం పోలింగ్‌కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను డీఎంహో జగన్మోహనరావు పరిశీలించారు.పెదభోగిలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో సీఐ రవికుమార్ సందర్శించా రు. ప్రశాంతంగా ఎన్నికలు ముగిసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## అద్దె భవనంలో సచివాలయం

- నారాయణపురంలో ఇబ్బందిపడుతున్న సిబ్బంది

**బలిజిపేట:** మండలంలోని నారాయణపురంలో గ్రామ సచివాలయం అద్దె భవనంలో నిర్వహిస్తుండడంతో సిబ్బంది, గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండువేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటుచేశారు. పదిమంది ఉద్యోగులను నియమించి, భవనాలు సైతం కేటాయించారు. అయితే నారాయణపురంలో సచివాలయం ప్రభుత్వం సచివాలయం భవనం నిర్మించేందుకు నిధులు మంజూరుకావడంతో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్థానిక వైసీపీనాయకులు భవననిర్మాణం ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో భవనం నిర్మించడం వల్ల విద్యార్థులు ఆటలకు దూరమవుతారని పేర్కొని హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో హైకోర్టు పాఠశాల ఆవరణలో సచివాలయం భవనం పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో సచివాలయ భవనం పనులు ముందుకుసాగలేదు. సొంతభవనం లేకపోవడంతో ఇరుగ్గా ఉన్న అద్దె భవనంలో ప్రస్తుతం ఏడు గురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే సచివాలయం మెటీరియల్ కూడా ఉంచడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. సమావేశాలు రోడ్డుపై లేకుంటే, పాకలో నిర్వహించాల్సివస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత సచివాలయం భవనం నిర్మించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




అద్దెభవనంలో కొనసాగుతున్న నారాయణపురం సచివాలయం